క్లుప్తంగా

వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన బెజవాడ సుబ్బారావు

నాగులుప్పలపాడు: బుల్లెట్ బండిపై వెళ్తున్న వ్యక్తికి కుక్క అడ్డురావడంతో కింద పడిన వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది సమాచారం మేరకు పోతరవం గ్రామానికి చెందిన బెజవాడ సుబ్బారావు తన బుల్లెట్ బండిపై పోతవరం నుంచి ఉప్పుగుండూరు వస్తున్న క్రమంలో ఉప్పుగుండూరు అయ్యప్పస్వామి గుడి వద్ద కుక్క ఎదురు రావడంతో బుల్లెట్ బండి అదుపుతప్పి సుబ్బారావు కింద పడటంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు తరలించారు.

మాదిగ ఉద్యోగుల సభ జయప్రదం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: జూలై 8న ఒంగోలులో జరిగే మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయిక సభను జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా యేసుదాసు కోరారు. గురువారం నాగులప్పలపాడులోని జగ్జీవన్ రామ్ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కృష్ణ మాదిగ నాయకత్వం లో ఎస్సీ వర్గీకరణ కోసం ఉమ్మడి కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కత్తి ఐజక్, తొరటి ఆనంద్, విజయ్‌కుమార్ ఉన్నారు.

బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం



అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

చీమకుర్తి: ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకుపోతున్నట్లు ఆ పార్టీ నాయకులు శ్రీపాద వరప్రసాద్, బొడ్డు శంకర్ తెలిపారు. గురువారం చీమకుర్తి పట్టణంలో బీజేపీ నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి అందిస్తూ ప్రచారం చేశారు.

ఐసెట్‌లో శ్రీసరస్వతి విద్యార్థికి 60వ ర్యాంకు



మేడిద గౌతమ్‌దేవ్

ఒంగోలు: తెలంగాణ నిర్వహించిన ఐసెట్ 2023 ప్రవేశ పరీక్షల్లో తమ కాలేజీ విద్యార్థి మేడిద గౌతమ్ దేవ్ నారాయణ మాల్య రాష్ట్రస్థాయి 60వ ర్యాంకు సాధించడం అభినందనీయమని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి అకడమిక్ విద్యతోపాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కాలేజీలో డిగ్రీ తరగతులతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, సీఆర్‌టీ తరగతులు, ఇంటర్న్‌షిప్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్లు ఆవుల గణేష్‌రెడ్డి, ఆవుల గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అభినందించారు.

అల్లుడి హత్య కేసులో అత్త అరెస్టు

ఒంగోలు టౌన్: మద్యానికి బానిసై తాగి తిరుగుతున్న అల్లుడిపై దాడి చేయడమే కాకుండా వేడి వేడి ద్రవాన్ని వేసి అల్లుడి మృతికి కారణమైన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సుజాతా నగర్‌లో నివసిస్తున్న సాదినేని రంగారావును ఈనెల 15వ తేదీ రాత్రి నిద్రిస్తున్న సమయంలో అత్త మాగులూరి లక్ష్మి దాడి చేయడమే కాకుండా వేడి వేడి నూనె వేయడంతో చికిత్స పొందుతూ మరణించాడు. రంగారావు మరణ వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసిన తాలూకా సీఐ రాంబాబు గురువారం గుల్లాపల్లి గ్రోత్ సెంటర్లో నిందితురాలిని అరెస్టు చేశారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

గిద్దలూరు రూరల్: మన స్నేహం ఎస్ఎస్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అంకణాంపల్లెలో నిరుపేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. దాతలు అశోక్‌గుప్తా, న్యాయవాది లక్ష్మిల సహకారంతో చీరలు పంపిణీ చేసినందుకు మనస్నేహం సంస్థ అధ్యక్షుడు కావేరి ధర్మేందర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సాయం చేయాలనే మంచి మనస్సు ఉన్న వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. బుజ్జి, జ్యోతి, సోని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఈతముక్కల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్గా నుండి బయటకు వస్తున్న ముస్లింలు

కొత్తపట్నం: బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. కొత్తపట్నంలో మస్‌జీద్-ఎ-మహ్మూదీయ, అల్లూరు గ్రామంలో మస్‌జిద్-ఎ-అహమదీయ, రంగాయపాలెంలో మస్‌జిద్-ఏ-నూర్, ఈతముక్కల గ్రామలో మదీన మస్‌జీద్, మడనూరులో మదీన మస్‌జీద్‌లో ప్రత్యేక పార్థనలు చేశారు. ఈద్గా దగ్గర మత పెద్దలచే నమాజ్ చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దలు, పిల్లలు ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు, ఇనమనమెళ్లూరు, వెల్లంపల్లి పెదకొత్తపల్లిలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఉదయమే ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లిం సోదరులు మౌలాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దాన ధర్మాలు చేశారు.

ఒంగోలు: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొణిజేడు బస్టాండు వద్ద ఉన్న ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువు మౌలానా మొహమ్మద్ హుస్సేన్ బక్రీద్ పర్వదినం విశిష్టతను, బక్రీద్ పర్వదినం సందర్భంలో హజ్ యాత్ర ప్రాముఖ్యతను వివరించారు. అల్లా ఆదేశాలను పాటిస్తూ సమాజంలో తోటి వారికి ప్రేమాభిమానాలు పంచుతూ.. బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పాలన్నారు.

రూ.13.59 కోట్లలో ఎనికపాడు అభివృద్ధి



ఎనికపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంతనూతలపాడు మండలం ఎనికపాడులో రూ.13.59 కోట్ల రూపాయల విలువ చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం ఎనికపాడులో మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి స్థానికులకు వివరించారు. అదే టీడీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్ళ కాలంలో కేవలం రూ.3.98 కోట్ల విలువ కలిగిన అభివృద్ధి పనులు మాత్రమే జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో చేపట్టిన సచివాలయాల వ్యవస్థ, నాడు-నేడు, సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల వివరాలను వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడి సీఎంగా మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ బి.వి జయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో నిరంతర సంక్షేమం



గడప గడపలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు



కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- గడప గడపకు ప్రజల నుంచి విశేష స్పందన
- గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు నిరంతరం అందుతున్నాయని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. పేర్నమిట్ట 40వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ పాల్గొన్నారు. పేర్నమిట్ట, నాంచారెడ్డివారిపాలెంలో గడప గడపకు కార్యక్రమం సాగింది. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందిస్తూ ఒక్కో ఇంటికి ఎంతెంత ప్రయోజనం కలిగిందో ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్ల నుంచి సంక్షేమ పథకాలను విరామం లేకుండా పేద ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల వలనే పేదల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. వాటితో పాటు ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్యకేంద్రాలను నిర్మించి స్థానిక గ్రామంలోనే ప్రజలందరికీ కావాల్సిన సేవలను పారదర్శకంగా సచివాలయాల సిబ్బంది ద్వారా అందిస్తున్నారన్నారు. మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగకుండా ప్రజలు నివసించే గ్రామంలోనే లంచాలకు తావులేకుండా సేవలను అందించే సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, లబ్ధిదారులు హారతులు పడుతూ పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి వాటర్ ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న చుండూరి రవితో సర్పంచ్ రాము, ఎంపీటీసీ దేవదాసు

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరప్పాడు ఎస్సీ కాలనీకి స్థానికుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవి తమ తాతగారు హనుమయ్య, వెంకాయమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటేశ్వర్లు కోటేశ్వరమ్మ అధ్వర్యంలో తమ్ముడు శ్రీనివాసరావు సహకారంతో ఆరు లక్షల రూపాయలు వెచ్చించి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. గురువారం కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. సర్పంచ్ బెజవాడ రాము మాట్లాడుతూ ఇప్పటికే కాలనీలో రాముల వారి అలయ నిర్మాణం చేయించిన చుండూరి రవి, కాలనీకి కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తూ వచ్చిన చుండూరి కుటుంబీకులను అభినందించారు. ఎంపీటీసీ సభ్యుడు బొమ్మల దేవదాసు మాట్లాడుతూ ఒక విధంగా దొడ్డవరప్పాడు ఎస్సీ కాలనీని చుండూరి కుటుంబం దత్తత తీసుకున్నట్లు భావిస్తున్నామని తమ కాలనీకి అండగా ఉంటూ ప్రతి సమస్య తీరుస్తున్న చుండూరి రవి బాబుకు వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గట్టినేని అయ్యన్న, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవంలో దంపతులు

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని ముప్పాళ్ళలో వేంచేసిన శ్రీ అభయాంజనేయస్వామి 12వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సువర్చల ఆంజనేయ స్వామి వారికి అర్చకులు బ్రహ్మానంద శర్మ ఆకుపూజ అభిషేకాలు జరిపారు. గ్రామ సర్పంచి వైకుంఠ పద్మశ్రీ వీరాంజనేయులు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించిన ఈ కల్యాణంలో 11 మంది దంపతులు పీటలపై కూర్చున్నారు. అనంతరం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దలు రామస్వామి, మురారి, శ్రీధర్, రత్తయ్య, పెంట్యాల బోస్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు సాయిచంద్‌కు ఘన నివాళి



సాయిచంద్‌కు కొవ్వొత్తుల నివాళి ప్రదర్శిస్తున్న కళాకారులు

ఒంగోలు: ప్రజాగాయకుడు సాయిచంద్‌కి స్థానిక కోలాస్ హోటల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం గురువారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో కొవ్వొత్తులతో జరిగిన ఈ కార్యక్రమానికి జనం పార్టీ అధ్యక్షులు చప్పిడి రవిశంకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితులు, పేదల పక్షాన తన పాటలతో చైతన్యం నింపిన గొప్ప కవి, గాయకుడు సాయిచంద్ అన్నారు. కవి, రచయిత డాక్టర్ మొగిలి దేవ మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణా ప్రజలను చైతన్య పరిచి, దళిత బహుజనుల గొంతుకై తన పాటలతో జాతిని జాగృతం చేసిన ప్రజా గాయకుడు సాయిచంద్ అని కొనియాడారు. సాయిచంద్ గుండె పోటుతో హఠాన్మరణం చెందడం యావత్ జాతికి తీరనిలోటన్నారు. సాయిచంద్ రాసిన «బాబా అంబేద్కరా ఓ భారత భాస్కరా, నీవే లేకుంటే ఏమైపోయుంటిమో। అంటూ రాసిన పాటను మొగిలి దేవ ఆలపించి నివాళులర్పించారు. సాయిచంద్ ప్రస్తుతం తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని బల్లికురవ వెంకట్, ప్రొఫెసర్ కంకణాల అంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాలడుగు రమేష్, జాలాది మోహన్, జనార్దన్, జైభీమ్ నాగేశ్వరరావు, చప్పిడి కోటేశ్వరరావు, యోబు, కేశవ్ నివాళులర్పించారు.

సంతనూతలపాడు జేసీఎస్ కన్వీనర్ల నియామకం

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మండల స్థాయి జేసీఎస్ కన్వీనర్‌ల నియామకాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సూచనల మేరకు వారిని నియమించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి తెలిపారు. జేసీఎస్ కన్వీనర్‌లుగా చీమకుర్తి రూరల్‌కు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, అర్బన్‌కు మంచా హరికృష్ణ, మద్దిపాడుకు బత్తుల శ్రీనివాసరావును నియమించారు. నాగులుప్పలపాడుకు కుమ్మూరి సూధాకర్‌రావు, సంతనూతలపాడుకు దుంపా యలమందారెడ్డి, పేర్నమిట్టలోని కార్పొరేట్ డివిజన్‌లు 39, 40, 41, 42కు కలిపి ఎస్‌కే నవీన్‌లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ధ్రువీకరించింది.

ఒంగోలు: నియోజకవర్గంలోని జేసీఎస్ మండల ఇన్‌చార్జులను ఖరారు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఒంగోలు నగరాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో మండల జేసీఎస్ ఇన్‌చార్జిని నియమించారు. 1-16 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జిగా సయ్యద్ జలీల్, 17-32 డివిజన్లకు క్లస్టర్ కొమ్మూరి రవిచంద్ర, 33-38, 43-40 డివిజన్ల క్లస్టర్‌కు గంటా రామానాయుడుని నియమించారు. ఒంగోలు రూరల్ మండలానికి చప్పిడి సోమశేఖరరావు, కొత్తపట్నం మండలానికి అల్లు రవీంద్రారెడ్డిని నియమించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొమరోలు: ఓ లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బేస్తవారపేట నుంచి గిద్దలూరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాటిచెర్లమోటు గ్రామ సమీపంలో లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో సైదులు అనే ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలు కావడంతో 108లో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

క్విజ్ పోటీల్లో ఉలిచి హైస్కూల్‌కు తృతీయ స్థానం



జిల్లా స్థాయి బహుమతి అందుకుంటున్న ఉలిచి విద్యార్థినిలు

ఒంగోలు రూరల్: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో ఉలిచి జిల్లా పరిషత్ హైస్కూలు టీం మూడో బహుమతి సాధించింది. కె.జాహ్నవి, ఎం.సింధుకు అభినందనలు తెలిపారు. వీరికి గైడుగా మ్యాథ్స్ టీచర్ ఎం.రత్నసుధ వ్యవహరించగా విజేతలను హెచ్‌ఎం సి.హెచ్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయ బృందరం అభినందించారు. వారికి రత్నసుధ గైడుగా వ్యవహరించారు. జిల్లా స్థాయి బహుమతి సాధించిన ఈ విద్యార్థులను, గైడును, హెచ్‌ఎంను ఎంఈవో-1 కిషోర్‌బాబు, ఎంఈవో సరస్వతి అభినందించారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

- కాలిపోయిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ 48 గంటల్లో మార్చాలి
- ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన సత్వరమే పరిష్కరించాలని జిల్లాలోని విద్యుత్ అధికారులను ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లాలోని విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్య సిబ్బంది దృష్టికి రాగానే వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే నిబంధనల ప్రకారం 48 గంటల్లో మార్చాలని కూడా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు ఇతర విద్యుత్ సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా జిల్లా పరిధిలోని విద్యుత్ సమస్యల కోసం 94408 17491, 94408 11903 నంబర్లకు కూడా ఫోన్ చేసి ఫిర్యాదు చేయటం కానీ, సమాచారం అందించటం కానీ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలసత్వం చేస్తే సిబ్బందిపై కఠిన చర్యలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. జిల్లాలో ఏఈఈలు లేని సబ్ స్టేషన్ పరిధిల్లో జేఈఈలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి ప్రజలకు సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు వారి పరిధిలోని సమస్యలను అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా తొలి ఏకాదశి



పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి గురువారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన సకల దేవతలకు పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదాలతో పాటు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. భక్తులకు శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న వితరణ ఏర్పాటు చేశారు.

కొత్తపట్నం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురష్కరించుకుని గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గాదెపాలెం రాములవారి ఆలయం, మోటుమాలలో కోదండరామస్వామి, కొత్తపట్నంలో నాగేశ్వరస్వామి, నాంచారమ్మ తల్లి, అల్లూరులో సాయిబాబు, మడనూరు గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం



కందకాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేసిన ఖండిత కందకాలను సెంట్రల్ నోడల్ అధికారి, సాంకేతిక అధికారి పి.యాదయ్య, డ్వామా పీడీ కె.శీనారెడ్డిలు గురువారం పరిశీలించారు. రోజుకు ఎంత మేరకు పని చేస్తున్నారని, సిబ్బంది పనులు కల్పిస్తున్నారా లేదా అని తదితర వివరాలు కూలీలను కేంద్ర బృందం అడిగి తెలుసుకుంది. కేంద్ర బృందం మాట్లాడుతూ పని ఎంత చేసుకుంటే అంత డబ్బులు వస్తాయని తెలిసింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. పెద్దారవీడు ఎంపీడీఓ కార్యాలయ అవరణంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రూఫ్ వాటర్ స్ట్రక్చర్‌ను పరిశీలించిన అనంతరం మొక్కలు నాటారు. ఎంపీడీఓ ఎం. నాసరరెడ్డి, ఏపీడీ భాస్కరరావు, ఏపీఓ సాంబశివయ్య, క్షత్ర సహాయకుల సంఘ మండల అధ్యక్షుడు ఒద్దుల లక్ష్మీరెడ్డి, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బెల్ల స్థానం తిరునాళ్ల



అలంకరణలో శివలింగం

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు పంచాయతీ పరిధి పోచమక్కపల్లి రెవిన్యూలోని బెల్ల స్థానం కొండపై తిరునాళ్ళ గురువారం భక్తులు వైభవంగా నిర వ్రహించారు. చుట్టు పక్కల గ్రామాలు ఇండ్లచెరువు, భూమనపల్లి, పిచ్చిగుంట్లపల్లి, పడమర పల్లి, గజ్జలకొండ, మాలపాటిపల్లి, కలివెలపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొండపై వెలసిన శివపార్వతి, ఆంజనేయస్వాములను పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు బెల్ల స్థానం కొండపై తిరనాళ్ళ జరుపుకుంటారు. ఆడపడుచులు వారి మొక్కులు చెల్లించుకుంటారు. తిరునాళ్ళకు వచ్చిన భక్తులకు దాతలు అన్నధాన కార్యక్రమం నిర్వహించారు.